గరిష్టం/కనిష్టం
28.1 /21.4
వాతావరణం
చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.


కామారెడ్డి జీఆర్ కాలనీలో తడిసి ముద్దయిన సామగ్రిని ఇంటిబయటకు తెచ్చిన కాలనీవాసులు

న్యూస్‌రీల్

'వరద బాధితులను ఆదుకోవాలి'



కామారెడ్డి టౌన్: వరద బాధితులను ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కామారెడ్డిలో పర్యటించి, ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. వరద బాధిత కుటుంబాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అశిష్ సంగ్వాన్‌ను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలో వరదను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేది కాదన్నారు. వరదలతో దెబ్బతిన్న జిల్లాకు ప్రభుత్వం రూ. 2 వేల కోట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నరసింహారావు, వెంకట్ రాములు, శోభనాయక్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌గౌడ్, కొత్త నర్సింలు, రేణుక, అరుణ్, మోహన్, శ్రీను, సత్యం, రాహుల్, నితిన్ పాల్గొన్నారు.

'విద్రోహ దినంలో పాల్గొనాలి'

కామారెడ్డి అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం నిర్వహించనున్నట్లు జేఏసీ నేతలు వెంకట్‌రెడ్డి, దేవేందర్ తెలిపారు. ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో విద్రోహ దినం పాటిస్తామని పేర్కొన్నారు. ఇందులో జేఏసీ ప్రతినిధులు నల్ల చొక్కా లేదా నల్ల బ్యాడ్జీలతో పాల్గొనాలని కోరారు.

యూరియా కోసం ఆందోళన



మాచారెడ్డి: యూరియా కోసం విసిగి వేసారిన రైతులు రోడ్డెక్కారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్దకు యూరియా కోసం వెళ్లిన రైతులకు చేదు అనుభవం ఎదురైంది. క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తానని విక్రేత చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియాను అధిక ధరలకు విక్రయించడమే కాకుండా రూ. 2 వేల నుంచి రూ. 3 వేల క్రిమి సంహారక మందులు కొనమంటే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు స్పందించి యూరియా ఇప్పించాలని కోరారు.

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి



కామారెడ్డి అర్బన్ : క్రీడల్లో ప్రతిభ ఉంటే సామాన్యులైనా ఉన్నతంగా ఎదగవచ్చని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి పేర్కొన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ప్రతిఒక్కరు క్రీడల్లో రాణించాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాస రఘుకుమార్, ప్రతినిధులు పెట్టిగాడి అంజయ్య, జె.లక్ష్మిరాజం, గంగారెడ్డి, అనిల్‌రెడ్డి, గోమతి, రాజ్‌కుమార్, భరత్, సురేందర్, అజయ్, యోగా విద్యార్థులు పాల్గొన్నారు.


జీఆర్ కాలనీలో ఇంట్లో చేరిన చెత్తను బయటకు ఊడుస్తున్న వ్యక్తి


కామారెడ్డి జీఆర్ కాలనీలో వరద నీటిలో తడిసిన వస్తువులను ఇంటి బయట పెట్టిన కాలనీవాసులు


అచ్చంపేట మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థులను కేజీబీవీకి తరలిస్తున్న అధికారులు


లింగంపేటలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన దూడ


లింగంపేట మండలంలో మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

వరద విలాపం

- తీవ్ర నష్టం మిగిల్చిన వర్ష బీభత్సం
- ఇళ్లలో చేరిన నీటితో దెబ్బతిన్న సామగ్రి
- పంట చేలల్లో ఇసుక మేటలు
- దెబ్బతిన్న రోడ్లు.. రాకపోకలకు ఆటంకం
- తెగిపోయిన కల్యాణి ప్రాజెక్టు కట్ట
- విరిగి పడిన విద్యుత్ స్తంభాలు

భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. పలువురిని కోలుకోలేని దెబ్బతీసింది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఎటుచూసినా వరుణుడు సృష్టించిన బీభత్సమే కనిపిస్తోంది. పంటలు కోల్పోయి కొందరు.. ఇళ్లు కూలి మరికొందరు.. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఇంకొందరు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో జరిగిన వరద నష్టంపై 'సాక్షి' బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు సేకరించింది. ఎవరిని కదిలించినా కన్నీళ్లే సమాధానంగా వచ్చాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : "ఏమున్నది.. ఉన్నదంతా ఊడ్చుకుపోయింది.. అన్నీ నాశనం అయినయి. మా బతుకులు ఆగమైనయి. మాకు దిక్కెవరు" అంటూ వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి పరిస్థితి కంటతడి పెట్టిస్తోంది. జిల్లాలో బుధ, గురువారాల్లో వరద సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. వేలాది కుటుంబాలు ఆగమయ్యాయి. వరదలు ముంచెత్తడంతో కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీలలో తీవ్ర నష్టం జరిగింది. ఈ కాలనీలలో నివసిస్తున్న వారిలో అధికులు దిగువ మధ్యతరగతికి చెందిన వారే.. ఉద్యోగాలు, వ్యాపారాలు, వృత్తులు చేసుకునేవారు బ్యాంకు లోన్లు తీసుకుని ఇళ్లు కొనుగోలు చేశారు. అకస్మాత్తుగా వచ్చిన వరదలు వారిని ఇక్కట్ల పాలు చేశాయి. ఇళ్లలోకి భారీగా వరద నీరు చేయడంతో ఇళ్లల్లోని అన్ని వస్తువులూ దెబ్బతిన్నాయి. కొందరి బైకులు, కార్లు వరదలో కొట్టుకుపోగా, మరికొందరి వాహనాలు దెబ్బతిన్నాయి. ఒక్కో కుటుంబానికి తక్కువలో తక్కువ రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది.


కల్యాణి ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో వృథాగా వెళ్తున్న నీరు

పంటలు గంగపాలు...

వరదలతో వేలాది ఎకరాల్లో పంటలు నీటిపాలయ్యాయి. జిల్లాలో దాదాపు 80 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. కొన్నిచోట్ల ఇసుక మేటలు వేసింది. దీంతో పంట పోగా, పొలంలో నిండిన ఇసుకను తీయడం మరింత భారంగా మారింది. ఎకరాకు రూ.20 వేల పైనే పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు నిండా మునిగి రోడ్డున పడ్డామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు రూ.150 కోట్ల మేర పంట నష్టం జరిగి ఉంటుందని అంచనా.

రోడ్లు దెబ్బతిని నిలిచిన రాకపోకలు

జిల్లాలో ప్రధాన రోడ్లు చాలావరకు దెబ్బతిన్నాయి. 44వ నంబరు జాతీయ రహదారిపై పలుచోట్ల గండ్లు పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. తాత్కాలిక మరమ్మతులతో రాకపోకలు సాగిస్తున్నా, ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే మెదక్–ఎల్లారెడ్డి–బాన్సువాడ రోడ్డు పూర్తిగా బందయ్యింది. పోచారం సమీపంలో వంతెన పూర్తిగా దెబ్బతినడంతో ఇప్పట్లో బాగు చేసే పరిస్థితి లేకుండాపోయింది. కరీంనగర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి రోడ్డుపై పలుచోట్ల వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బాన్సువాడ–కామారెడ్డి రోడ్డు పరిస్థితి కూడా అంతే.. కొన్ని ఊళ్లలోనయితే అన్ని వైపులా రోడ్లు తెగిపోయి బయటకు వెళ్లలేని పరిస్థితులున్నాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నమోదైన వర్షపాతం వివరాలు.. (మి.మీటర్లలో)

ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం
		బిచ్కుంద	83.5
రామారెడ్డి	171.3	పిట్లం	78.6
బొమ్మన్‌దేవ్‌పల్లి	152.5	పాతరాజంపేట	72.0
సోమూర్	143.3	ఇసాయిపేట	71.5
మగ్దుంపూర్	143.3	లచ్చాపేట్	70.0
కొల్లూర్	126.3	లింగంపేట	69.3
రామలక్ష్మణ్‌పల్లి	125.0	నాగిరెడ్డిపేట	65.5
తాడ్వాయి	115.0	ఎల్పుగొండ	65.5
హాసన్‌పల్లి	103.5	మాచాపూర్	58.0
కామారెడ్డి	101.3	దోమకొండ	54.3
జుక్కల్	99.5	సదాశివనగర్	53.0
డోంగ్లీ	96.5	ఆర్గొండ	39.0
బీర్కూర్	95.5	పుల్కల్	32.3
మేనూర్	94.8	భిక్కనూరు	31.0
పెద్దకొడప్‌గల్	87.0	బీబీపేట్	27.5

వేగంగా ట్రాక్ పునరుద్ధరణ



భిక్కనూరు : భిక్కనూరు–తలమడ్ల రైల్వే స్టేషన్‌ల మధ్య రామేశ్వర్‌పల్లి గ్రామ శివారులో 50 మీటర్ల పొడవున దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. 350 మంది కార్మికులు, 10 పొక్లెయిన్‌లు, 25 ట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పనులు సాగుతున్నాయి.


వరదలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షిస్తున్న గర్గుల్‌వాసులు

కొనసాగుతున్న మరమ్మతులు

నాగిరెడ్డిపేట: భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పోచారం ప్రాజెక్టు అలుగు సపోర్ట్‌వాల్ వద్ద తాత్కాలిక మరమ్మతులు కొనసాగుతున్నాయి. సపోర్ట్‌వాల్‌పై ఇసుక బస్తాలను అడ్డుగా ఏర్పాటు చేశారు. మట్టి కొట్టుకుపోవడంతో ఏర్పడిన భారీగుంతలో ట్రాక్టర్లతో మొరం పోయించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాంచందర్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, కిరణ్‌కుమార్, శేఖర్, షాహెద్ పాల్గొన్నారు.

నష్టం రూ. 150 కోట్లపైనే..

- తాత్కాలిక పనులకు రూ.22.47 కోట్లు
- పూర్తి స్థాయి పనులకు రూ.130.3 కోట్లు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వరదలు, వర్షాలు సృష్టించిన బీభత్సానికి జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన నష్టం లెక్కలు తేలాయి. వివిధ శాఖలకు సంబంధించి జిల్లాలో 633 పనులు చేపట్టేందుకు గాను తాత్కాలిక మరమ్మతులకు రూ. 22.47 కోట్లు అవసరం అవుతాయని, పూర్తి స్థాయిలో పనులు చేపట్టేందుకు రూ. 130.3 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో పంట నష్టానికి సంబంధించి గానీ, ఇళ్లు కూలిపోయిన, వరదల్లో ఇళ్లల్లోని సామగ్రిని కోల్పోయి నిరాశ్రయులైన వారికి అందించే సాయం గురించి లెక్కలు వేయలేదు. అవన్నీ కలిపితే రూ. 350 కోట్లు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.


కిష్టాపూర్, కిష్టాపూర్ తండాల మధ్య రోడ్డు కొట్టుకుపోవడంతో పాలను తాడు సాయంతో పంపిస్తున్న రైతులు

శాఖలవారీగా ప్రతిపాదనల (రూ. లక్షలలో) వివరాలు..

శాఖ	పనులు	తాత్కాలిక మరమ్మతుల వ్యయం	పూర్తి స్థాయిలో పనులకు అయ్యే వ్యయం
నీటి పారుదల శాఖ	93	143.85	3,378.60
రోడ్లు భవనాలు	79	346.10	6,119.40
పంచాయతీరాజ్	48	154.15	1,150.20
ఆర్‌డబ్ల్యూఎస్	18	225.00	-
ఎన్పీడీసీఎల్	-	209.00	-
కామారెడ్డి బల్దియా	104	1106.00	1,326.00
బాన్సువాడ బల్దియా	04	35.86	-
బిచ్కుంద బల్దియా	01	7.50	-
ఎల్లారెడ్డి బల్దియా	05	20.30	-
డీఎంహెచ్‌వో	40	-	47.30
డీపీవో	38	-	105.57
స్కూల్స్	203	-	909.75
వ్యవసాయం	-	-	-
మొత్తం	633	2,247.76	13,037.42


లింగంపేట మండలంలో కొట్టుకుపోయిన వంతెన


ఎల్లారెడ్డి శివారులో నీట మునిగిన పంటలు

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన..


టేక్రియాల్ వద్ద దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డిక్రైం/నిజాంసాగర్: టేక్రియాల్ చెరువు అలుగు ప్రవాహానికి దెబ్బతిన్న జాతీయ రహదారిని ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి ట్రాఫిక్‌కు ఇబ్బందికలగకుండా త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. మహమ్మద్‌నగర్ మండలంలోని బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్లను ఎస్పీ పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం గోర్గల్ గ్రామ గేటు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, మర్‌పల్లి గ్రామానికి చెందిన బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు. ఆయన వెంట ఏఎస్పీ నరసింహారెడ్డి, బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, మహ్మద్‌నగర్ ఎస్సై శివకుమార్, మద్నూర్ ఎస్సై విజయ్ కొండ తదితరులున్నారు.


సిర్‌పూర్ ఎస్సీ కాలనీని ముంచెత్తిన వరదనీరు

జలదిగ్బంధంలో పల్లెలు

- లెండి వాగుతో ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్
- పునరావాస కేంద్రాల్లో వరద బాధితులు

మద్నూర్: ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో అక్కడి నుంచి లెండి వాగు వరద నీటితో మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి మద్నూర్ మండలంలోని గోజేగావ్, తడి హిప్పర్గా, డోంగ్లీ మండలంలోని లింబూర్, చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, సిర్‌పూర్ గ్రామాలకు వెళ్లే రహదారులపైగల లోలెవల్ వంతెనలు నీట మునిగాయి. సిర్‌పూర్, లింబూర్ గ్రామాల్లోని బీసీ, ఎస్సీ కాలనీలలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మద్నూర్ మండలంలోని రాచూర్‌కు వెళ్లే రహదారి కోతకు గురైంది. దీంతో రాచూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని గోజేగావ్ గ్రామ శివారు వరకు లెండి వరద నీరు రావడంతో ప్రజలు భయాందోళ చెందుతున్నారు. అలాగే సోనాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైతం వరద నీరు వచ్చి చేరింది. అధికారులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా గురువారమే సుమారు 500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మద్నూర్, డోంగ్లీలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలను పరిశీలించారు. వరద బాధితులకు చీరలు, దుప్పట్లను అందించారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే కూడా పునరావాస కేంద్రాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు.


మద్నూర్ పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులు